

డ్రై డే పాటించాలి : కమిషనర్


ప్రజాశక్తి - కడప అర్బన్ : ఫ్రైడే డ్రై డే పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం బుడ్డాయపల్లిలో డ్రై డే కార్యక్రమం ప్రారంభించారు. గృహాల్లో నిల్వ ఉన్ననీటిని మార్చాలని, మన నివాస ప్రాంతంలో ఉన్నటువంటి టెంకాయ చిప్పలు, పూల తోట్లు, టైర్స్, చెత్తకుండీలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అక్కడి ప్రజలతో మాట్లాడుతూ వారికి ఉన్నటువంటి అవగాహనను గురించి తెలుసుకున్నారు. రుతుపవనాల గురించి ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. రాబోవు నెలలలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నీరు నిలిచి ఉండే ప్రాంతాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉత్పత్తి అధికంగా జరిగి తద్వారా దోమల వల్ల పిల్లలు, పెద్దలకు మలేరియా, డెంగీ సోకే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు.

డయేరియా నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

వైఎస్ఆర్ జిల్లాను డయేరియా రహిత, ఆరోగ్య సహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి అతిసార కేసుల వ్యాప్తి, నియంత్రణ (స్టాప్ డయేరియా క్యాంపెన్), తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టరేట్‌లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కార్యక్రమనికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్ హాజరయ్యారు. సిఎల్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ/మానిటరింగ్ మెకానిజం అత్యంత ముఖ్యంగా అమలు చేయాలన్నారు. ఈ విషయమై వర్క్‌షాప్ నిర్వహించాలని, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి.. ఆశా వర్కర్‌ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఇసి యాక్టివిటీలను చేపట్టాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య పరిరక్షణా చర్యలు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ అధికారులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు/జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం, తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. ఎక్కడా అతిసార, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అనుబంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్ పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ కుమార్, శ్రీలక్ష్మి అన్ని ప్రాధాన్యత రంగ జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యు ఎస్ అధికారులు పాల్గొన్నారు.



విసిలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్, జెసి

సుందరయ్య కాలనీకి తాగునీటిని అందించాలి

కమిషనర్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి
ధర్నాలో సిపిఎం పట్టణ నాయకులు ముడియం చిన్ని



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, కాలనీ వాసులు

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించాలని, మున్సిపల్ కమిషనర్ ఇచ్చినటువంటి హామీని నిలబెట్టుకోవాలని లేకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం బద్వేల్ పట్టణ నాయకులు ముడియం చిన్ని హెచ్చరించారు. శుక్రవారం బద్వేల్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో 15 ఏళ్ల నుంచి మంచినీటి సౌకర్యం లేకపోవడంతో పొలాల్లోకి వెళ్లి మోటర్ నీటిని రాత్రి సమయంలో తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. గతంలో అనేక దఫాలుగా ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్, పూసలవాడ సచివాలయం అధికారులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. ధర్నాలూ కూడా చేశామని, అయినప్పటికీ మంచినీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సుందరయ్య కాలనీలో బోరు వేయడం వేశారే తప్ప మోటర్ కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి సుందరయ్య కాలనీలో మోటర్ కనెక్షన్ బిగించి ఇస్తే దాదాపు 100 కుటుంబాలకు మంచినీటి సౌకర్యం కల్పించిన వారు అవుతారని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపి వెంటనే ఆ కాలనీకి పైపులైన్స్ ఏర్పాటు చేయాలని, ఇచ్చినటువంటి హామీలు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ, అనంతమ్మ, పట్టణ నాయకులు ఆంజనేయులు, గోవర్ధన్ , నారాయణ, రాయప్ప, జోష్, ఓబయ్య ఖైరున్ బి , మస్తాన్ బి, ఫాతిమా, రామలక్ష్మమ్మ, మాధవి, చంద్రకళ ,అరుణ, స్వీటీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



సూపర్ కె గోల్డ్ మెంబర్షిప్ ను ప్రారంభిస్తున్న అనిల్, నీరజ్

సూపర్ కె గోల్డ్ మెంబర్షిప్ లాంచింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిలో అతిపెద్ద ఫ్రాంఛేజి సూపర్ మార్కెట్ చెయిన్ మార్కెట్ సూపర్ కె శుక్రవారం సూపర్‌కె గోల్డ్ మెంబర్షిప్ కడపలో లాంచ్ చేయడం సంతోషంగా ఉందని వ్యవస్థాపకులు అనిల్, నీరజ్ మెంటా పేర్కొన్నారు. శనివారం సూపర్ కె రాయలసీమ గోడౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పట్టణాలకు మంచి సూపర్ మార్కెట్ సౌకర్యం కల్పించాలనేదే లక్ష్యమన్నారు. గోల్డ్ మెంబర్షిప్ సూపర్‌కె ప్రయాణంలో కొత్త దశ అని చెప్పారు. ఇంటి దగ్గరే ఉండడంతో మార్కెటింగ్ చేయడం చాలా సులువుగా ఉంటుందని తెలిపారు. సూపర్ గోల్డ్ మెంబర్షిప్ ద్వారా సరుకుల పైన 10 శాతం క్యాష్ బ్యాక్ పొందవచ్చు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగీతంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థులు సంగీతంపై పట్టు సాధించాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రవీంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ సంగీత దినోత్సవ సందర్భంగా పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతానికి శిశువులు, పశువులే కాదు సర్పాలు సైతం పరవశించి పోతాయనీ, యోగా-సంగీతాల ద్వారా నయం కానీ ఎన్నో జబ్బులు నయమవుతాయని తెలిపారు. ఒత్తిడిని దూరం చేసి మానసిక ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. అలాగే కలత చెందిన మనసును కుదుటపరిచే అమ్మ జోల పాట వంటిది సంగీతం అన్నారు. లలిత కళల్లో సంగీతానికి ప్రముఖస్థానం ఉంది అనీ, మనసుకు కలిగిన బాధను తగ్గించి ఆనందాన్ని పెంచే గొప్ప సాధనం సంగీతం అన్నారు. అనంతరం విద్యార్థులు సంగీత ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను విన్నవిస్తున్న వాలంటీర్లు

వైసిపి నాయకుల ఒత్తిడితోనే రాజీనామా చేశాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఎన్నికలకు ముందు వైసిపి నాయకుల ఒత్తిడితోనే వార్డు వాలంటీర్లగా రాజీనామా చేశాని వాలంటీర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరమణారెడ్డికి వారు వినతిపత్రం అందించారు. తమకు ఇష్టం లేకున్నా వాలంటరీ పదవికి రాజీనామా చేశామని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. ఐదేళ్లు రూ.5 వేలు వేతనం తీసుకుని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేశామని చెప్పారు. తమల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ రంగనాథరెడ్డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్



డాక్టర్ రంగనాథరెడ్డిని సన్మానిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి

ప్రజలకు యోగా సేవలు అందించడంలో ప్రముఖ యోగా న్ని నిపుణులు డాక్టర్ ఆర్. రంగ నాథరెడ్డి అభినందనీయులని ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని విద్యాసాగర్ ఆసుపత్రిలో డాక్టర్ రంగనాథరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలని చెప్పారు. ఈ ఏడాది యోగా థీమ్ యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అని యుఎన్ఓ పేర్కొందని తెలిపారు. డాక్టర్ రంగనాథరెడ్డి మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి యోగా చక్కని సాధనమని ప్రపంచమంతా గుర్తించిందని పేర్కొన్నారు. రోజూ పటేల్ రోడ్ లోని మిత్ర యోగా సెంటర్‌లో యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, ఇంటెక్ సభ్యులు డి ఎస్ ఎస్ తాహిన్, డాక్టర్ పి.వి. సుబ్బారెడ్డి, డాక్టర్ శ్రీలక్ష్మి, రాజశేఖర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, గణపతి, డాక్టర్ ఎదు భూషణ రాజు పాల్గొన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధిగా సిద్ధార్థ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన కసెట్టి సిద్దు రాయల్‌ను శుక్రవారం టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి జిల్లా అధ్యక్షులు నియమించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ రాయల్ మాట్లాడుతూ టిఎన్ఎస్ఎఫ్ తరపున జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో ఉన్నటువంటి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. నమ్మకంతో పెద్దలు తనకు ఇచ్చిన ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకుని అందరికీ ఉపయోగపడేలా ఉంటానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్సీ శివనాద్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డికి , టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్‌కి, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షులు

అంతర్మథనమే



సార్వత్రిక ఎన్నికల ఓటమి వైసిపిని ఆత్మరక్షణలో పడేసింది. 2009లో పార్టీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి కడప జిల్లాల్లో వైసిపికి తిరుగులేని సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి కంచుకోట బద్దలు కావడంపై సీరియస్ సమీక్షకు ఆవశ్యకత ఏర్పడింది. ఎక్కడ పొరపాటు దొర్లిందనే అంశంపై లోతైన వరుస సమీక్షలతో భవిష్యత్ కార్యకలాపాల రూపకల్పన చేసుకోవాలి. వైఎస్ జగన్ నివాసమైన తాడేపల్లి, తాజాగా అసెంబ్లీ ఛాంబర్ వేదికగా చర్చోపచర్చలు చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో ఓటమి పాలైన అనంతరం తొలిసారి పులివెందులకు వస్తున్న నేపథ్యంలో ఘోర పరాజయానికి గల కారణాలను, క్షేత్ర స్థాయి పరిశీలనలతో సరిపోల్చి చూసుకోవాలి.

నేడు పులివెందులకు జగన్ క్షేత్రస్థాయి సమీక్షకు అవకాశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. వైసిపి శ్రేణుల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, దిశానిర్దేశం చేయాలి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాలో వైసిపి ఉనికి పాతాళానికి పడి పోయింది. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట పార్లమెంటు స్థానాలు సహా 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కడప జిల్లాలో పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లి స్థానాలకు పరిమితం కావడాన్ని సీరియస్‌గా సమీక్షించాల్సి ఉంది. ఓటమికి గల కారణాలను అధ్యయనం చేయాలి. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ పరిస్థితి రాష్ట్ర మంతటా ఒకెత్తు అయితే వైఎస్ జగన్ సొంత జిల్లాలో పార్టీ పరిస్థితి ఒకెత్తు. ఇటువంటి ప్రత్యేకతల నేపథ్యంలో ముందుగా ఇంటిని(జిల్లాను) చక్కదిద్దుకునే ప్రయత్నం చేయడం అత్యవసరం. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఘోర పరాజయానికి గల కారణాలను అన్వేషించాలి. విజయవాడలోని వైఎస్ జగన్ నివాసమైన తాడేపల్లిలో ఓటమి పాలైన వైసిపి అభ్యర్థులు, గెలుపొందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించడం, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం సందర్భంగా అసెంబ్లీ ఛాంబర్‌లో గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలతో సమావేశం కావడం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత శనివారం సొంతగడ్డ పులివెందులకు రానున్నారు. సుమారు ఐదు రోజులు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి విరామం నేపథ్యంలో తన పాలనలో సంక్షేమం, అభివృద్ధి, పార్టీని విస్మరించడం, కేడర్ కబ్జాల సరళి, సాంకేతికత అంశాలపై దొర్లిన తప్పిదాలపై క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించుకునే ప్రయత్నం చేయాలి. ఫలితంగా ప్రతి పక్ష హోదా కూడా దక్కని విధంగా ఘోర పరాజయం పలకరించడంపై లోతుగా సమీక్షించుకోవాలి. తన పాలనలో దొర్లిన తప్పిదాలను సమీక్షించుకోవాలి. టిడిపి హామీల అమలును పరిశీలించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణను అమలు చేయాలి. ప్రజల పక్షాన నిలిచి, ప్రజాసమస్యలపై సమరశంఖం పూరించాలి. పులివెందులలో ఐదు రోజులు ఉండనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్‌పిటిసిల నుంచి ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి ప్రజాప్రతినిధులను దగ్గరగా కలిసి, తన పాలనలో దొర్లిన తప్పిదాలపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, విధానాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేసుకోవాలి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కడప

132 కెవి మూలవంక సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 22న ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు చింతకొమ్మదిన్నె మండలం పరిధిలోను మూలవంక, చిన్నకాంపల్లి, నాగి రెడ్డిపల్లి, రిమ్స్, ఐటీ పార్కు, గొర్లపల్లి, దర్బార్ పేట, తెలుగు గంగా కాలనీ, కృష్ణాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కడప డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. విద్యుత్ వినియో గదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

2024, మే 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్ఆర్ జిల్లా ఎమ్మెల్యేలు శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, బద్వేల్, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఆర్.మాధవి, నంద్యాల వరదరాజులరెడ్డి, చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా చైతన్యరెడ్డిలతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు.



వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి



డాక్టర్ సుధా



ఆర్.మాధవి



ఎన్.వరదరాజులరెడ్డి



ఎ.ఆదినారాయణరెడ్డి



పుట్టా సుధాకర్‌యాదవ్



పుత్తా చైతన్యరెడ్డి

మోటర్ వెహికల్ చట్ట సవరణను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రవాణా రంగానికి మరణ శాసనమైన మోటార్ వెహికల్ చట్టం 2019ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో రవాణా కార్మికుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటర్ వెహికల్ సవరణ చట్టం, 2019 మన దేశంలో చిన్న, మధ్య తరహా యాజమాన్యానికి, డ్రైవర్ కం ఓనర్లుకు ఇబ్బందికరమని తెలిపారు. రోడ్డు రవాణా రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చారని పేర్కొన్నారు. జరిమానాలు, చలానాలు, పెనాల్టీలు అనేక రేట్లు పెంచి డ్రైవర్ల ఓనర్ల, రక్తాన్ని పిండుతున్నారని చెప్పారు. అన్ని వాహనాల థర్డ్ పార్టీ బీమా ప్రీమియం రెట్టింపు కంటే ఎక్కువగా పెంచారని తెలిపారు. సాధారణంగా ప్రీమియాలను ప్రమాదాలు, చెల్లించిన పరిహారం ఆధారంగా నిర్ణయించాలని చెప్పారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 10 ఏళ్లలో ప్రమాదాలు రెండింతలు పెరగలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ కూడా ప్రీమియం రెట్టింపు అయ్యాయని తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వం బీమా కంపెనీలకు మేలు చేసే పాత్ర పోషించిందని చెప్పారు. మళ్లీ టోల్ ఛార్జీలు వసూలు చేయడం ప్రజలను మోసం చేయడమే తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. నిర్దిష్ట వ్యవధి తర్వాత టోల్ల్ ఛార్జీలను రద్దు చేయాలని, కానీ ఆచరణలో మాత్రం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆశ్చర్యకరంగా ఏటా టోల్ ఛార్జీలు పెంచుతున్నారని తెలిపారు. ఇది ప్రజలను దోచుకోవడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. డ్రైవర్లు, కష్టమర్ల ప్రయోజనాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం ఉబర్, ఓలా , రాపిడో మొదలైన వాటికి ప్రత్యామ్నాయ యాప్ను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఛార్జీలు, కార్మికుల సంక్షేమం మొదలైన వాటికి సంబంధించి ఇప్పటికే ఉన్న యాప్ కంపెనీలను నియంత్రించేందుకు చట్టాన్ని రూపొందించాలని తెలిపారు. వాహన స్క్రాపింగ్ విధానం తప్పనిసరి కాకూడదని పేర్కొన్నారు. 'ఈ' చలానాలు రద్దు చేయాలని చెప్పారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సుంకర రవి, లింగప్ప, రవి, రాము, ఎల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

కమనీయం కరుణశ్రీ కవిత్వం

ప్రజాశక్తి - కడప అర్బన్

కరుణశ్రీగా ప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి కవిత్వం ప్రత్యేక శైలిని కలిగి, ఆలోచనాత్మకంగా ఉండి పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుందని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో శుక్రవారం జంధ్యాల పాపయ్య శాస్త్రి 32వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కరుణ శ్రీ రాసిన ఉదయశ్రీ. కరుణ శ్రీ, విజయ శ్రీ, లలిత సుగుణ జాల తెలుగు బాల,ప్రేమ మూర్తి,స్వప్న వాసదత్తం, భాగవత వైజయంతిక గ్రంథాలు తెలుగు సాహిత్య లోకంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయన్నారు. కవి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి కరుణ శ్రీ కవిత్వం సంప్రదాయ, ఆధునిక, ఆధ్యాత్మిక అంశాలతో కలిసి ఉంటుందని, కరుణ శ్రీ లాంటి మహోన్నత కవి మనకు లభించడం ఆంధ్రుల అదృష్టమే అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు గంగయ్య, గండి రామసుబ్బయ్య, రవీంద్రనాథ్‌రెడ్డి, గంగయ్య యాదవ్, వెంకటరమణ, గడికోట రెడ్డయ్య,మాదిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

వ్యవస్థలను రిపేరు చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- కడప అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5 కోట్ల ప్రజల అమరావతి, పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. ఈ సందర్భంగా మన్సూరు అక్బర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలు అస్తవ్యస్తం చేశారని పేర్కొన్నారు. అధికారులకు వాటిపైన పట్టు సాధించే దిశగా టిడిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిగా అండగా ఉన్నారన్నారు. పోలవరం కొనసాగించలేక, చేతకాగా వైసిపి ప్రభుత్వం నిందలు వేసి జగన్ మోహన్ రెడ్డి రివర్స్ పరిపాలించిన తీరును ప్రజలు గ్రహించారని తెలిపారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోగపోగా తనకే అర్థం కాలేదని, ఇంకెవ్వరికి అర్థం కాదు అనే విధంగా భాధ్యత లేకుండా మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతుంటే ప్రజలు అసహించుకున్నారని తెలిపారు. పోలవరం పూర్తి చేసి రాయలసీమకు తాగు, సాగు నీరు తెచ్చి సస్య శ్యామలం చేస్తారన్నారు.

నేడు ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : మైదుకూరులోని సునీల్ ఫిజియో కేర్‌లో ఈనెల 22న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఉచిత చర్మవ్యాధుల మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ వి.భార్గవ్ రామ్ తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని శ్రీ నారాయణీ కేర్ హాస్పిటల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా శనివారం మైదుకూరులోని ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న సునీల్ ఫిజియో కేర్‌లో ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్ పూర్తిగా ఉచితమన్నారు. శిబిరానికి విచ్చేసిన వారికి అవసరమైన మందులు, ఆయింట్మెంట్లు రాయితీతో అందజేస్తామని వివరించారు. చర్మ వ్యాధులు, వెంట్రుకల, గోర్ల సమస్యలు, సుఖ వ్యాధులు, లైంగిక సమస్యలు తదితరాలతో బాధపడుతున్న వారు ఈ శిబిరానికి తరలిరావాలని సూచించారు.



పులివెందుల రూరల్ : అన్నదానం చేస్తున్న దాతలు

అంధుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ పరిధిలోని నివేదిత పాఠశాల సమీపంలో ఉన్న అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం లింగాల మండలం కర్ణ పాపాయపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస జయరామక్రిష్ణారెడ్డి కుమారుడు సుజిత్ రెడ్డి 13వ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను అంధుల ఆశ్రమంలో జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. పుట్టినరోజులకు అనవసర ఖర్చులు చేయకుండా అన్నదాన కార్యక్రమం చేయడం వల్ల పది మందికి కడుపు నింపిన వాళ్లమవుతామన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉమాదేవి , సాయి రమ పాల్గొన్నారు. **నిరాశ్రయుల వసతి గృహంలో..**

కడప : కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెప్పలి పుల్లయ్య ఏకైక కుమార్తె చెప్పలి లక్ష్మీ గీతిక పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆదరణ నిరాశ్రయుల గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన కుమార్తె పుట్టినరోజు ఇలా నిరాశ్రయుల గృహంలో చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇలాగే చాలామంది పార్టీలకు, అనవసర కార్యక్రమాల్లో డబ్బులు వృథా చేయకుండా నిరాశ్రయులకు, అనాధలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మొదటగా కేక్ కట్ చేసి, తర్వాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆదరణ సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాశినాయన

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినంగా చర్యలు తప్పవని తహశీల్దార్ కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జెసిబి, ట్రాక్టర్ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం సమీపంలోని సగిలేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే ఎంతటి వారి పైనా చర్యలు తీసుకుంటామని, అక్కడ ఉన్న జెసిబిలు ట్రాక్టర్లు సీజ్ చేస్తామని అన్నారు. ఏదైనా రైతులకు, ప్రజలకు అత్యవసరమైతే తమ దగ్గర నుండి అనుమతి తీసుకోవాలన్నారు. ఇప్పటికే నరసాపురం, సాగిలేరులో ఇష్టం వచ్చినట్లు గుంతలు తీశారని పేర్కొన్నారు. అక్కడ ఎవరైనా జెసిబితో, ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

ప్రజాశక్తి - వేంపల్లె

ఫిజియోథెరపీ చేయించుకోవడం వల్ల అంగ వైకల్యం దూరం అవుతుందని ఫిజియోథెరపిస్టులు రమేష్, వెంకట రమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన నిజాం ఫిజియోథెరఫీ సంస్థ ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెయిన్ కిల్లర్ మందులు వాడకుండా ఫిజియోథెరపీ చేసుకొంటే ఎక్కువ ప్రయోజనాలు ఉన్నట్లు చెప్పారు. మొబైల్ వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయని పేర్కొన్నారు. ఎక్కువగా తలనొప్పి, మెడ నొప్పి, పేరాలసిస్ వంటి వాటికి ఎటువంటి వ్యాయామం చేయాలనే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం వినికిడి లోపం ఉన్న కావ్య అనే చిన్నారికి వినికిడి యంత్రాన్ని ఎంఇఒ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, ఫిజియోథెరపీ ఆనంద్, ఐఇఆర్టీలు యశోధ, ఎంఆర్ సి సిబ్బంది సిఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని ఎంపిపి స్కూల్ (మెయిన్ స్కూల్)లో పాఠశాల ఉపాధ్యాయులు రమణా రెడ్డి, కుమారుడు ఆకాష్ రెడ్డి విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని శుక్రవారం వితరణ చేశారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఈఓ చేతులమీదుగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి అవసరమైన నోటు పుస్తకాలు,పెన్సిల్లు,పెన్నులు, పలకలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి, లీలావతమ్మ, సర్వేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

సింహాద్రిపురం : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మండల టిడిపి నాయకులు, మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలిశారు. శుక్రవారం విజయవాడలోని సెక్రటేరియట్ కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పలు రాజకీయ అంశాలు, రవాణా శాఖకు సంబంధించి చర్చించినట్లు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈయనతో పాటు లింగాల మండలం టిడిపి నాయకులు దేవి రెడ్డి సంజీవరెడ్డి ఉన్నారు.

లీకేజీల మయం.. మోడీ ప్రభుత్వం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె



నిరసన తెలియజేస్తున్న తులసిరెడ్డి, ఆమ్ ఆద్మీపార్టీ నాయకులు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లీకుల మయంగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో ఒక పరీక్ష కూడా నిర్వహించలేదు అన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. పోటి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని అసమర్థత, దద్దమ్మ ప్రభుత్వంగా మారిందని చెప్పారు. 10 సంవత్సరాల మోడీ పాలనలో దాదాపు 72 సార్లు పరీక్ష పేపర్లు లీక్ అయినట్లు చెప్పారు. మే 5న దేశ వ్యాప్తంగా వైద్య కళాశాల్లో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ పరీక్ష నిర్వహించారన్నారు. . దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. కానీ దురదృష్టవశాత్తు ముందు రోజే బీహార్, గుజరాత్, హర్యానా రాష్ట్రాల్లో అనేక చోట్ల పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని చెప్పారు. డబ్బులు భారీగా చేతులు మారినట్లు చెప్పారు. ఒక్కోక అభ్యర్థి నుంచి రూ 30 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. బీహార్‌లో 14 మందిని అరెస్టు చేశారన్నారు. నీట్ పరీక్ష ల్లో ఇంత అవకతవకలు జరిగినప్పటికీ ప్రధాని మోడీ మాట్లాడడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ మౌనం వీడి నీట్ పై మాట్లాడాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలపై విచారణ జరిపి ద్రోహులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఆమ్ అద్మీ పార్టీ జిల్లా కో- ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్, పీరుబాషా, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, వేమా రాజా వినయ్, రవి, మహబూబ్ బాషా (మాస్), మదార్, బద్రి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స నాయకులు

బోయినపల్లి ఎస్‌టి కాలనీ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- గోపవరం

బద్వేల్ మండలంలోని ఇ.బోయనపల్లి గ్రామంలో ఎస్‌టి కాలనీలో సుధీర్ఘంగా పరిష్కారం కానటువంటి స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం బద్వేల్ మండల కార్యదర్శి పి రవిచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఇ.బోయినపల్లి ఎస్‌టి కాలనీలో ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, మంచినీరు , మురుగు కాలువలు, వీధి కరెంటు పోల్ వీధిలైట్ల సమస్యలున్నాయని, అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని దీనివల్ల ప్రజలు, అవస్థలు పడుతున్నారని వెంటనే వీటిని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో సమస్యలను అప్పటి నాయకులు, అధికారులు గాలికి వదిలేశారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఉపయోగం లేకపోయిందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 9 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా అనసూర్య, పి.రమాదేవి కమిటీ సభ్యులుగా వి.శ్వేత, వెంకటలక్ష్మి, రవణమ్మ వెంకటయ్య సి.రామయ్య ఎన్నుకున్నారు, సమావేశంలో సంఘం నాయకులు ఈ.రమణయ్య పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఓబులాపురం రాజశేఖర్

ప్రజాశక్తి- బద్వేలు

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి ఆంధ్రప్రదేశ్ విచ్చేసిన సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను శుక్రవారం గుంటూరులోని తన స్వగృహంలో కలిసి డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబం నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదగడం చాలా సంతోషకరమైన విషయంగా తెలిపారు.



స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

విత్తన దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని కమలాపురం సహాయ సంచాలకులు ఎ.వి. నరసింహారెడ్డి డీలర్లకు సూచించారు. మండలంలోని విత్తన దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డితో కలిసి కమలాపురం ఎడిఎ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన దుకాణాల్లో లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లలు, బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డులు, గోడౌన్ స్టాక్ పాయింట్లను పరిశీలించామని చెప్పారు. దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. కొనుగోలు చేసిన వాటికి నగదు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఎఒ మాట్లాడుతూ వ్యవ సాయ శాఖ ద్వారా అనుమతి పొందిన వాటిని మాత్రమే రైతులకు అమ్మాలన్నారు. కాల పరిమితి ముగిసిన విత్తనాలను రైతులకు విక్రయిస్తే విత్తన నియంత్రణ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం విత్తన వ్యాపారాలు నిర్వహించాలని తెలిపారు.

వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించొద్దు

ప్రజాశక్తి-చెన్నూరు

యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కొందరు టిఎన్ఎస్ఎఫ్ఐ నాయకులు తొలగించమని వైస్ ఛాన్సలర్‌కు వినతి పత్రం అందించడం బాధాకరమని వైసిపి జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఒకప్పుడు యోగి వేమన విశ్వవిద్యాలయం కడప జిల్లాకు వచ్చేందుకు వైఎస్ఆర్ కృషి చేశారన్నారు. విద్యా వ్యవస్థకు ఆయన చేసినటువంటి కృషి వల్ల యోగి వేమన విశ్వవిద్యాలయం ఏర్పడిందని తెలిపారు. అలాంటి మహానుభావునికి ఆనాడు పాలాభిషేకం చేసిన యోగి విశ్వవిద్యాలయంలో నేడు ఆయన విగ్రహాన్ని తొలగించాలని కోరడం దుర్మార్గమని ఆయన అన్నారు.



నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

మూలన పడ్డ మినరల్ వాటర్ ప్లాంట్

ఇబ్బందుల్లో లింగారెడ్డిపల్లి ప్రజలు - పునరుద్ధరించాలని వేడుకోలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని లింగారెడ్డిపల్లి పంచాయతీలో 2010-11వ సంవత్సరంలో సమగ్ర వాటర్ షెడ్ యాజమాన్య పథకం కింద సుమారు 4.19 లక్షలతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ మూలనపడింది. ఏర్పాటు చేసినప్పటి నుంచి రెండున్నరేళ్లు మాత్రమే ప్రజలకు తాగునీటిని అందించారు. తరువాత 2014లో లింగారెడ్డిపల్లితోపాటు, ముదిరెడ్డిపల్లె గ్రామాల్లో మైక్రో వాటర్ షెడ్ల పథకం కింద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. వాటి నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి. దీంతో 1500 జనాభా కల్గిన లింగారెడ్డిపల్లి, హృదయపేట, నల్గొండపల్లి ప్రజలకు మినరల్ వాటర్ కరువైంది. 85,900 ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ గురించి సర్పంచులు కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదు. పలుమార్లు గ్రామస్తులు వాటి పునర్ధురణ గురించి ప్రజాప్రతినిధులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా పంచాయతీ నిధులతోనైనా మూతపడిన వాటర్‌ప్లాంట్లను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డిఆర్ఎం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్‌ను శుక్రవారం గుంతకల్లు డివిజన్ డిఆర్ఎం విన్నీత్‌సింగ్ పరిశీలించారు. అనంతరం 1,2 ప్లాట్‌ఫారాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, క్వార్టర్స్ పరిశీలించారు. క్వార్టర్స్‌లో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఆర్ఒ వాటర్ ప్లాంటు తయారు చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ముద్దనూరులో పలు రైళ్లను ఆపాలని మండల వాసులు డిఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైల్వే డివిజన్ అధికారులు సుధీర్, చంద్రశేఖర్, ముద్దనూరు సిటిఎన్ సి అధికారి చంద్ర శేఖర్, స్టేషన్ మేనేజర్ భాస్కర్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్, డిహెచ్‌పిఎస్ నాయకులు

బిసి భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ పట్టణంలో బిసి భవనంతోపాటు పూలే, అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అవాజ్ పట్టణ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సత్తార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగ వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో బిసిలు 60 వేలకుపైగా జనాభా ఉన్నారని తెలిపారు. ఇంతమంది ఉన్నా పట్టణంలో ఒక బిసి భవనం లేకపోవడం విచారించదగ్గ విషయమని పేర్కొన్నారు. బిసిల ందరూ సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఉపయో గకరమని చెప్పారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రజా సంఘాలుగా విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వమైనా బిసి భవనం స్థలం, అంబేద్కర్, పూలే స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. బిసి భవనం ఏర్పాటు చేయకపోతే బిసిలమంతా ఏకమై ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ ఉపాధ్యక్షులు ఖాజా గౌస్, నాయకులు కె వి.రసూల్, రహీం నాగూర్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న సుమనశ్రీ

కోడూరు సుమనశ్రీకి మలేషియా అంతర్జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపకు చెందిన ప్రముఖ నర్తకి, రచయిత్రి డాక్టర్ కోడూరు సుమనశ్రీకి మలేషియా అంతర్జాతీయ పురస్కారం లభించింది. మలేషియా ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ వారి ఆహ్వానం మేరకు ఈనెల 15 నుంచి 20 వరకు జరిగిన భారతీయ కళా ఉత్సవాలలో డాక్టర్ కోడూరు సుమనశ్రీ పాల్గొని కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. తర్వాత మలేషియా ప్రభుత్వ సాంస్కృతిక శాఖామంత్రి సరస్వతిచే సత్కారం, అంతర్జాతీయ పురస్కారం అందుకున్నారు. ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ సంస్థకు చెందిన పవన్, శ్రీరామయ్య ఈ సందర్భంగా సుమనశ్రీని అభినందించారు.

నేడు కెఎస్ఆర్ఎం కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి- కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ 2020 - 2024 బ్యాచ్‌లో వివిధ బ్రాంచీలలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు 7వ స్నాతకోత్సవాన్ని ఈనెల 22న కెఒఆర్ఎం ఆడిటోరియంలో ఘనంఆ నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జెఎన్‌టియు అనంతపురం విసి, ప్రొఫెసర్ జి.వి.ఆర్ శ్రీనివాసరావు హాజరు కానున్నారు. వీరి ద్వారా పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను అందించడంతో పాటు, బ్రాంచుల వారీగా ప్రశంసా పత్రాలను అందించచున్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.శ్రీనివాస్ , వారి సిబ్బంది, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు హాజరుకావాలన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

ప్రజాశక్తి - కడప/కడప అర్బన్



కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

యోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని, ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి, వారిని నిరాశ, నిస్పృహల నుంచి బయటకు తీసుకురావడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ ఎస్.బాబా ఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మిత్రా యోగ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కె.కల్పన పాల్గొన్నారు. **రిమ్స్‌లో..** కడప వైద్య కళాశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు దాసరి ఆధ్వర్యంలో నిర్వహించారు. **మిత్ర యోగా సెంటర్‌లో..** యోగా దినోత్సవం మన వారసత్వ సంపద గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పే మహాసంకల్పం అని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ అన్నారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు డాక్టర్ రంగనాథరెడ్డి యువతకు యోగ ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో పోతుల వెంట్రామిరెడ్డి, ఇంటాక్, లయన్స్ క్లబ్ సభ్యులు, జెబివిఎస్ అశోక్, నవతరం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. **నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో..** 'నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో యోగబ్యాస ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్, సీడప్ డిస్టిక్ మేనేజర్ వేణుమాధవ్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సి.ఎస్.ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు. **ప్రభుత్వ పురుషుల కళాశాలలో** ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కలిసి యోగ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ అధ్యాపకులు ఆదినారాయణ, శివరాం, భయపరెడ్డి, నాగభూషణ రెడ్డి, విజయ్ కుమార్, సతీష్ రెడ్డి, డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష్ణ, లీలా వర్ధిని పాల్గొన్నారు. **ఉమేష్‌చంద్ర కల్యాణ మండపంలో..**యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎఎస్‌పి లోసారి సుధాకర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, డిటిసి డిఎస్‌పి రవికుమార్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమాకాంత్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి, టైటాస్, వన్ టౌన్ సిఐ భాస్కర్ రెడ్డి, చిన్న చౌక్ సిఐ నరసింహారెడ్డి పాల్గొన్నారు. **ముద్దనూరు:** యోగతో ఆరోగ్యానికి శక్తి లభిస్తుందని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ బాబు అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాధవ రెడ్డి, యోగా మాస్టర్ రామ్ కుమార్ విద్యార్థులచే యోగా నిర్వ హించారు. అనంతరం ఉపాధ్యాయుడు కుండాభాస్కర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **గోపవరం :** బద్వేల్ కోర్టు భవనాల సముదాయంలో యోగా గురువు అమరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** యోగాతో ఆరోగ్యం పదిలం అని గురువు వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎపికార్ల్‌లో ఉన్న వ్యవసాయ కళాశాలలో, ప్రభుత్వ బాలికల కళాశాల, సరస్వతి విద్యా మందిరం ఆవరణలో విద్యార్థులకు యోగా ఆసనాలు చేయించారు. కార్ర్యమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థి వ్యవహారాల అధికారి డాక్టర్ కె.ఎన్. శ్రీనివాసులు, అకడమిక్ అధికారి హరిప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, యోగా టీచర్లు నాగరాజు, శంకర్ రెడ్డి, బాలిక కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ గణేష్, ప్రోగ్రామ్ అధికారి నాగేంద్రమ్మ, యోగా శిష్యులు నాగరాజు, నీలావతి, ప్రభావతి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు పాల్గొన్నారు. **వేంపల్లె :** యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఒత్తిడిని తగ్గిస్తుందని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామిగుప్తా అన్నారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య పాఠశాల, నారాయణ పాఠశాల, తాళ్ళపల్లె వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో స్థానిక వైఎస్ఆర్ పార్కు, ఉర్దూ గురుకుల పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, టిడిపి నాయకుడు డివి సుబ్బారెడ్డి, వైద్యులు స్వాతి సాయి, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, బాలుర పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, పిఇటి రాజశేఖర్, ధర్మారెడ్డి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక రాణి తిరుమలదేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో సహజ యోగా ధ్యానం ఆధ్వర్యంలో గురూజీలు వెంకటరామిరెడ్డి, కృష్ణ, వెంకటరమణ విద్యార్థులకు సహజ యోగా ధ్యానం చేయించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరుణ్ ఇంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టీ చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్ సుబ్బారాయుడు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందాలని ఓం మండలి ధ్యాన కేంద్రం, ప్రొద్దుటూరు అవ్వారు సుబ్బ రామయ్య కోరారు. **చాపాడు :** యోగాపై ధ్యాస ఉంచాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి బాలికల పాఠశాల, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పాఠశాలలో కుమార్, కావ్య మాధురి, ఓబులేసు సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిశంకర్, కెజిబివి ప్రిన్సిపల్ నాగలక్షుమ్మ, జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గౌస్ మొహిద్దీన్,మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య, సిహెచ్ఒ మహాదేవ్ యాదవ్, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ సరస్వతీ, బాబురెడ్డి పాల్గొన్నారు. **ఖాజీపేట :** యోగా ద్వారా మానసిక ప్రశాంత సాధ్యమని గ్రూప్ వన్ అధికారి బీరం శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీరం విద్యా సంస్థల చైర్మన్ బీరం సుబ్బారెడ్డి, బీరం స్వాతి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. పలు రంగాలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, అధ్యాపకులు, పిఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీ, ప్రభుత్వ బాలుర, బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిత్తా, రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రభావతమ్మ పాల్గొన్నారు. **మైదుకూరు :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణరెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి, అధ్యాపక సిబ్బంది రామేశ్వర్‌రెడ్డి, అనురాధ, నరసింహారావు, నవ నీశ్వర్ రెడ్డి, అయ్యవారురెడ్డి పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ అండ్ పీజీ కళాశాల యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా గురువు అమర్‌నాథ్ రెడ్డి యోగా యొక్క విశిష్టతను తెలియజేసి విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. **కాశినాయన :** స్థానిక ఎపి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు యోగపై ప్రిన్సిపల్ సౌజన్య అవగాహన కల్పించి పిల్లలతో యోగా చేయించారు. విద్యార్థులు యోగా అంటే చిన్న చూడరాదని, ఆరోగ్యం మెరగువుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు **చెన్నూరు :** యోగా మానసిక ఒత్తిడిని దూరం చేసి శరీర, మానసిక ఆనందాన్ని కలిగిస్తుందని యోగా గురువు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు గంగిరెడ్డి. సునీత. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని ఆయుష్మన్ ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ జ్యోష్ణ, డాక్టర్ ప్రియాంకల ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రశాంత్, స్వాతి, వరలక్ష్మి, భాను, ప్రసన్న, ఆశా వర్కర్లు, పిల్లలు, గర్భిణులు, వృద్దులు, గ్రామస్తులు పాల్గొన్నారు.